
# సింబల్

పి.లోకేశ్వర్

**కమ్మరి కొలిమిలో** మండుతున్న ఇనుములా సూర్యుడు వెలిగిపోతున్నాడు; మండిపోతున్నాడు. మండు వేసవిలో, మంచి మధ్యాహ్న సమయంలో సిటీ బస్సులో ప్రయాణం చేస్తున్నాను. హైద్రాబాదులాంటి మహా నగరంలో నివసిస్తున్న నేరానికి శిక్షగా తప్పనిసరిగా ప్రయాణం చేయాల్సిన సిటీ బస్సు.

ఆ రోజు కూర్చునేందుకు సీటు కాదు సరికదా —నిలబడేందుకు చోటుకూడా లేనందున, ఘోరమైన తపస్సు చేస్తున్న మునీశ్వరుడి లాగా ఒంటి కాలుమీద నిలబడి ప్రయాణం చేస్తున్నాను. జనంతో బస్సు మొత్తం కిక్కిరిసి పోయింది. గాలి రాకపోవటం వలన ఉక్కగా, ఉక్కిరి బిక్కిరిగా ఉంది. దానికి తోడు చెమట కంపు చికాకు, చీదర. ఈ బస్సు ప్రయాణాలు మన నిత్య జీవితంలో తప్పించుకోలేని ఒక నెసెసరీ ఈవిల్ కాబట్టి ఆ వాతావరణాన్ని భరిస్తూ అలాగే నిలుచున్నాను.

పద్మవ్యూహాన్ని ఛేదించుకుని ముందుకు వెళ్ళే అభిమన్యుడిలా కండక్టరు ప్రజా వ్యూహాన్ని ఛేదించుకుంటూ ఒక్కొక్కరి వద్దే డబ్బులు వసూలు చేసుకుంటూ టిక్కట్లు ఇస్తున్నాడు. నిజంగా కండక్టర్ జాబ్ రిస్క్ జాబ్ అని నా అభిప్రాయం. ప్రతి రోజూ రకరకాల మనస్తత్వాలు కలిగిన వందలాది ప్రజలతో అతను మెలగాల్సి వస్తుంది. అందర్నీ మెప్పించాల్సి వస్తుంది. అందుబాటులో ఎదురుగా ఉండేది అతనే కాబట్టి సాధారణంగా ప్రయాణీకు లందరూ ఆర్టీసీ పై



తమకున్న కోపాన్ని, అసంతృప్తినీ అతని పైనే చూపిస్తూ ఉంటారు. అరిటాకు- ముల్లు సామెత అతని ఉద్యోగానికి సరిగ్గా సరిపోతుంది. అందుకే కండక్టర్లంటే నాకు దయా, సానుభూతి.

"మేం లేవం. నువ్వేం చేసుకుంటావో చేసుకో. నీకు దిక్కున్న చోట చెప్పుకో" అన్న కేకలతో నేను నా ఆలోచనా ప్రపంచంనుండి కిందికి భూమ్మీద ఊడి పడ్డాను. బస్సంతా గొడవ గొడవగా ఉంది.

కండక్టరు బస్సు ముందు భాగంలో స్త్రీల సీట్ల వద్ద నిలబడి ఉన్నాడు. ముందున్న నాలు గయిదు స్త్రీల సీట్లలో కాలేజీ విద్యార్థు లనబడే కొందరు రౌడీలు జబర్దస్తీగా బైఠాయించి ఉన్నారు. వారి పక్కనే బిక్కు బిక్కుమని బెదురు చూపులు చూస్తూ, గువ్వపిట్టలా ముడుచుకుని పోయి కాలేజీ అమ్మాయిలు నిలుచుని ఉన్నారు. వారిలో ఏ ఒక్కరికీకూడా తమ కోసం కేటయించిన ఆ సీట్లను ఖాళీ చేయమని అడిగే ధైర్యం లేదని వారి ముఖాలు చూ స్తేనే తెలిసి పోతుంది.

కండక్టరు ఆ స్టూడెంట్ల కేమో నచ్చ చెబుతున్నాడు. బతిమాలుతున్నాడు. సీట్లను ఖాళీ చేయ



మని మరీ మరీ ప్రార్థిస్తున్నాడు. అయినా, ఆ గుంపు సీట్లలోనుండి లేవటం లేదు. పైగా ఆ అమ్మాయిలను కళ్ళతోనే తినే సేలా చూడటం, వీలున్నప్పుడల్లా వాళ్ళపై వాలుతూ, తాకుతూ మధ్య మధ్యలో ద్వందార్థాల జోకులు వినుర్తున్నారు. మరి కొంతమందేమో కండక్టరును ఏడిపిస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు.

పరి స్థితిని గమనించిన నాకు ఒళ్ళంతా భగ్గుమంది. ఆవేశం ఉప్పెనలా ముంచుకొచ్చింది. నిస్సహాయుడైన కండక్టరుపై జాలి, సానుభూతితో పాటు ఆ పోకిరీ గుంపుపై కోపం పెరిగిపోయింది. ఎటువంటి ఆశయ ఆదర్శాలు, లక్ష్యం, గమ్యం లేక అచ్చోసిన ఆంబోతుల్లా తిరిగే ఈ బావతుమూ కలకు గట్టిగా బుద్ధి చెప్పాలనిపించింది.

ఓసారి చుట్టూ కలయచూశాను. బస్సులోని ప్రయాణీకులంతా పవరికి వారు తమ కేమీ పట్టనట్లు కళ్ళు, చెవులు మూ సుకుని కొందరుంటే— మరి కొందరేమో సినిమాను చూస్తున్నట్లు వినోదంగా చూస్తున్నారే తప్ప కండక్టరును సపోర్టు చేయడమో, లేదా ఆ రౌడీలకు తగిన విధంగా బుద్ధి చెప్పటమో చేయటం లేదు. తా మేదో నిమిత్తమాత్రులం అన్నట్లు నిర్లిప్తంగా ఉన్నారు. ఆవేశంతో ముందుకు దూసుకెళ్ళాను. బ్రూటల్ ఫోర్సుకు హృదయ పరివర్తన, మాన సిక పరివర్తన కలిగించే బోధనలు పనికి రావని నా నమ్మకం.

"లేడీస్ సీట్లలో కూచోవాలని ఉంటే చీరా, జాకెట్టూ వేసుకు రావాలి, మిస్టర్! తెలిసిందా?" అంటూ ఒకడి కాలర్ పట్టుకుని అమాంతంగా పైకి లేపాను.

ఊహించని పరిణామానికి ఆ మూ క నివ్వెరపోయారు. ఒక రిద్దరు ఎదురు తిరగాలని ప్రయత్నించి, అంతలోనే నా కళ్ళలోని కోపాన్ని, కసిని, నా బలమైన శరీరాన్ని చూసి కుక్కిన పేనుల్లా అయిపోయారు. అందర్నీ బతిమాలడం, నచ్చ చెప్పటమే అలవాటయిన కండక్టరు ఆ సీను చూడగానే బెదిరిపోయినట్లున్నాడు. గొడవవుతుందన్న భయంతో బస్సును ఆపేయమని బెల్ కొట్టగానే బస్సు ఆగిపోయింది. అలా ఆగిపోయిన బస్సు రోడ్డుమీద ట్రాఫిక్ అంతటినీ జామ్ చేయడంతో, ట్రాఫిక్ పోలీసులు ఏమైందేమైందంటూ ప్రశ్నిస్తూ బస్సులోకి ప్రవేశించారు. కండక్టరు భయం భయంగా జరిగిన గొడవంతా వారికి విన్నవించాడు. అంతవరకూ లేడీస్ సీట్లను ఆక్రమించి కూచున్న ఆ గ్రామ సింహాలన్నీ పోలీసులను చూడగానే తోకలు ముడుచుకుని లేచి నిలబడ్డాయి. అందాకా బూతులు, తిట్లు వల్లించిన వాళ్ళ నోళ్ళు టపీమని మూ సుకున్నాయి. అమ్మాయిలను ఓర చూపులు, కోరచూపులు చూసిన వాళ్ళ కళ్ళు భయంతో వెలవెలా పోయాయి. విషయమంతా విన్న పోలీసు లాఠీలు టపీ టపీమని ఆన్ ది స్పాట్‌గా ఆ అమ్మాయిల సమక్షంలోనే ఆ జులాయి సరుకును ఉచిత రీతితో సత్కరించి, తగు లాంఛనాలతో వారిని బస్సులోనుండి కిందికి లాగి పోలీసు స్టేషనుకు తీసుకెళ్ళాయి. ఆ తరవాత ఆ అమ్మాయి లంతా సంతోషంతో ఖాళీ చేయబడ్డ సీట్లలో కూచుని నా వైపు కృతజ్ఞతా పూర్వకంగా చూశారు.

ఆగిపోయిన బస్సు మళ్ళీ కదిలింది. ప్రయాణికు లందరూ నన్ను అడ్మైరింగ్‌గా చూస్తున్నారన్న విషయం తప్ప ఆ బస్సులో ఇంకా కొద్ది మంది విద్యార్థులు మిగిలి ఉన్నారన్న విషయం నేను గమనించలేదు.

ఇంతలో బస్సు కాలేజీ స్టేజీలో ఆగింది. అంత వరకూ నిశ్శబ్దంగా నిలుచున్న స్టూడెంట్సు గబగబా బస్సులోనుండి దిగి, బస్సు వెళ్ళకుండా దాని ముందు భాగాన అడ్డంగా నిలుచుని "స్టాప్ ది బస్" అంటూ డ్రైవరును పెద్దగా బెదిరించి, దూరంగా నిలుచున్న తమ మిత్రుల్ని ఉద్దేశించి గట్టిగా విజిల్స్ వేశారు. నేను పరి స్థితి గమనించే లోగానే బస్సు చుట్టూ స్టూడెంట్స్ గుమిగూడారు. "పోలీసులు అనవసరంగా తమ మిత్రులను అరెస్టు చేసినట్లు, వారిని లాఠీలతో చితక బాదినట్లు, దానికి కారణం కండక్టరురు, నేను అయినట్లు" బస్సులో నుంచి దిగి వెళ్ళిన ఆ స్టూడెంట్స్ మిగతా వారికి చిలవలు, పలువలుగా వర్ణించి చెప్పారు.

దానితో అక్కడి వాతావరణం ఒక్కసారిగా బద్ధలయింది.

"పోలీస్ జులుం బంద్ కరో. ఆర్టీసీ డౌన్ డౌన్" అంటూ కేక లేస్తూ, వాళ్ళంతా బస్సును చుట్టుముట్టారు. మరి కొందరు లోపలికి దూసుకు వచ్చేశారు. వివేకం, విచక్షణా లేని ఆ గుంపును ఎలా ఎదుర్కోవాలో , ఎలా నచ్చ చెప్పాలో అని నేను ఆలోచిస్తూండగానే నన్ను, కండక్టరును కిందకి లాక్కెళ్ళి ఆ గుంపు మా పైన విరుచుకు పడింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే మే మిద్దరం వారి చేతులలో చిత్తు చిత్తుగా తన్నులు తిన్నాము. ఆ తరవాత ఆ గుంపు అక్కడ్నుంచి వెళ్ళిపోయింది.

చిరిగిన బట్టలతో, రక్తం కారుతున్న శరీరంతో లేచి నిలబడి బస్సు వైపు చూశాను. ప్రయాణీకు లందరూ అందులోనే ఉన్నారు. ఒక్కరుకూడా కిందకి దిగలేదు. ఎవరికి వారు తమ కేమీ పట్టనట్లు, తమ కేమీ తెలియనట్లు, అసలు వారికి ఆ సంఘటనతో సంబంధమే లేనట్లు నిమిత్తమాత్రులుగా, అన్నింటికీ అతీతులుగా కూచున్నారు. నా చొరవ, సాహసం వలన సీట్లలో కూచున్న అమ్మాయిలుకూడా కనీసం మా వైపైనా చూడకుండా భయం, భయంగా వాళ్ళలో వాళ్ళే ఏదో గుసగుస లాడుకుంటున్నారు.

ఆ అనుభవంతో నాకు జ్ఞానోదయమయింది. లోకంలో ఎన్నో అన్యాయాలు జరుగుతున్నా, వాటి గురించి తెలిసికూడా తమ కేమీ తెలీనట్లు, పట్టనట్లు కళ్ళు, చెవులూ మూ సుకుని, మెదళ్ళకు మూ త లేసుకుని, నత్తగుల్లల్లా తమలోకి తామే ముడుచుకునిపోయి, ఇమిడిపోయి బ్రతికే ప్రజలలోని ఒక భాగమే ఈ బస్సులోని ప్రయాణీకులు.

ప్రభుత్వాలు బలహీన వర్గాలకు హక్కుల్ని ఇచ్చినంత మాత్రాన లాభం లేదు. ఆ హక్కుల్ని పోరాడి, సాధించుకుని అనుభవించే సాహసం, చైతన్యం ఆ వర్గాల వారికి ఉండాలి. లేకపోతే బలవంతుల పన్నాగాలకు, దౌర్జన్యాలకు ఆ హక్కులు నామరూపాలు లేకుండా అయిపోతాయి. అటువంటి బలహీన వర్గాలలోని ఒక భాగమే ఈ బస్సులోని కాలేజీ అమ్మాయిలు.

ఇకపోతే వెనకా ముందూ చూసుకోకుండా ఆదర్శాలతో, ఆవేశంతో జ్వలించిపోతూ అన్యాయాన్ని ఎదిరించే నా లాంటివారికి చివరికి మిగిలేది కష్టాలు, కన్నీళ్ళు. ★